క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మాఘమాసం మొదటి శనివారం సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చండి



పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న దాదాపీర్

కలసపాడు : విద్యార్థులు పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను బాగా రాసి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాశీంవలి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పది, ఇంటర్ విద్యార్థినీలకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కని చేతిరాతతో పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. విద్యార్థులు బృంద చర్చల్లో పాల్గని పాఠ్యాంశాలపై చర్చించుకుంటే విషయం చాలా జ్ఞాపకం ఉంటుందన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. తెల్లవారుజామున 4 గంటల నుండి చదివితే ప్రయోజనం అన్నారు. అనవసరమైన భయాందోళనలు వీడి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఒత్తిడిని అధికమిస్తే విజేతలుగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ రెడ్డిజ్యోతి, పాఠశాల సిబ్బంది విజయలక్ష్మి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న పల్లేటి ప్రభాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రామేశ్వరంలోని మునెయ్యస్వామి ఆలయం వద్ద పాఠశాల 27వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. శివానంద సరస్వతి మాతాజీ మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చదువులో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పల్లేటి విష్ణుకుమార్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు బెంగళూరుకు చెందిన ఏరో ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ మేనేజర్ సి.కృష్ణ, డాక్టర్ షేక్ మహ్మద్ ఇర్ఫాన్, ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌వలి, పుష్పరాణి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

కడప కార్పొరేషన్ : పునీత లూర్దు మాత తిరుణాళ్ల సందర్భంగా శనివారం మరియాపురంలో కమిటీ సభ్యులు ఎం. జయమ్మ, జె. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మరియాపురం చర్చి ఫాదర్ బిరుసు రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. మరో ఐదుగురికి కన్సోలేషన్ ప్రైజెస్ ఇచ్చారు.

ఐఆర్‌ను ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 35 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఎస్‌టిఎఫ్ కడప జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ విధానాన్ని తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి, ఆవుల శ్రీనివాసులు, రామచంద్ర, క్రిష్టఫర్‌జాన్ పాల్గొన్నారు.

పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

• ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూపాయి ఖర్చు లేకుండా పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఉపసర్పంచ్ మాచిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అన్ని గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే తాళ్లమాపురం గ్రామంలో వైద్యశాల నిర్మించారని, ఇక్కడ డాక్టర్‌తోపాటు సిబ్బంది కూడా ఉంటారన్నారు. ఈ ఆస్పత్రిలో 114 రకాల మందులు రోగులకు అందుబాటులో ఉంటాయని, బీపీ, షుగర్ లాంటి పరీక్షలు ఇక్కడే చేయించుకోవచ్చన్నారు. ముందుగా ఉపసర్పంచ్ మాచిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యే రాచమల్లుకు గజమాల వేసి ఘన స్వాగతం



తాళ్లమాపురంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

పలికారు.

చంద్రబాబు డ్వాక్రా మహిళలను మోసం చేశాడు

ఎన్నికల సందర్భంగా డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేసిన ఘనత చంద్రబాబుదేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. తాళ్లమాపురం గ్రామంలో శనివారం సాయంత్రం వైఎస్సార్ ఆసరా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 600 హామీలు



డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ఇచ్చిన చంద్రబాబు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 4 విడతలుగా డ్వాక్రా రుణాలను మాఫీ చేశారు. తాళ్లమాపురం గ్రామానికి చెందిన 100 డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.58,94,456 మంజూరైందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి వద్దకే పింఛన్ అందిస్తోందన్నారు. గత ఎన్నికలలో కూడా ఈ గ్రామ పంచాయతీలో తనకు 1000 ఓట్ల మెజారిటీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని చెప్పారు. మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే తనకు ఓట్లు వేయాలని అడిగిన ముఖ్యమంత్రి మరెవరూ లేరని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాచిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్ సీపీనాయకులు డాక్టర్ తుపాకుల భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించాం

ప్రొద్దుటూరు : వైఎస్‌ఆర్‌సీపీ ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, మరోసారి అధికారమిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం మున్సిపాలిటీలోని 24వ వార్డు మౌలానా ఆజాద్ వీధి-2లో రూ.30 లక్షల అంచనాతో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించామని, ప్రతి రోజు తాగునీటిని అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బు జమ చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి పేదవాడికి కనీసం నాలుగు పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, 45ఏళ్ల వయసు పైబడిన మహిళలకు ఏడాదికి రూ.18,750 అందిస్తున్నామని, జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15వేలు ఇస్తున్నట్లు వివరించారు. సుమారు రూ.600 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. కానీ ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని విమర్శించడంలో అర్థం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఏ మేరకు అభివృద్ధి, సంక్షేమం జరిగిందో ప్రజలకు తెలుసునన్నారు. జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరోసారి ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రం, ప్రొద్దుటూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు షేక్ కమాల్ బాషా, వరికూటి ఓబుళరెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, బాలాజీ, జిలాని, సత్యం, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నూరి, హిదాయత్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గోపవరం : మండలంలోని మడకలవారిపల్లె డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపల్ బి.వి.సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 25 నుండి ఈ నెల 23వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష మార్చి 10వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 4-30 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి సంబంధించి పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాల చుట్టుపక్కల గ్రామాలకు సంబంధించిన విద్యార్థులు 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

13న మార్కెట్, బస్టాండులకు వేలం పాట

కమలాపురం : స్థానికంగా ఉన్న దినసరి మార్కెట్, బస్టాండు, జంతు వధశాల, మార్కెట్ గదులకు ఈ నెల 13న బహిరంగ వేలం పాట విధించినట్లు నగర కమిషనర్ రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు దినసరి మార్కెట్, బస్టాండు, జంతు వధశాల, మార్కెట్ రూములకు వేలం పాట దక్కించుకున్న వారు రుసుములు వసూలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. మార్కెట్, బస్టాండుకు రూ.50 వేలు, జంతువధ శాల, మార్కెట్ గదులకు రూ.20వేల చొప్పున డీడీలు ఈనెల 12 లోగా కార్యాలయంలో అందజేయాలన్నారు. అలాగే సాల్వెన్సి సర్టిఫికెట్లు కూడా అందజేయాలన్నారు. అలాంటి వారే వేలం పాటకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

కలసపాడు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా బూత్ అధ్యక్షులు, కో కన్వనర్లు, గృహసారథులు కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో బూత్ అధ్యక్షులు, కో కన్వీనర్లకు మేం సిద్ధం – మా బూత్ సిద్ధం అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందాయని, ఇంటింటికి తిరిగి ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించాలని తెలిపారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. కోవిడ్ కష్టకాలంలో జగనన్న లబ్ధిదారులకు ఎలా అండగా నిలిచారో ప్రతి ఇంటికి తిరిగి వివరించాలన్నారు. సంక్షేమ పథకాల పంపిణీలో సమస్యలు సృష్టించిన టీడీపీ, జనసేన వంటి పెత్తందారులపై జగనన్న ఎలా పోరాడుతున్నారో తెలియ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

జేయాలన్నారు. లబ్ధిదారులే జగనన్నకు నిజమైన స్టార్‌కాంపైనర్లు అని అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూధా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, పురుషోత్తంరెడ్డి, చిత్తారాజశేఖర్‌రెడ్డి, ఎ.వి.భాస్కర్‌రెడ్డి, పులివీరారెడ్డి, దేవసానిశ్రీనివాసరెడ్డి, పోకలరామకృష్ణారెడ్డి, సింగరయ్య పాల్గొన్నారు.

బస్సు సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం బద్వేలు డిపో నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన బద్వేలు-విజయవాడ బస్సు సర్వీసును శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గం నుంచి ఎంతో మంది విద్యార్థులు విజయవాడలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. గత ఐదేళ్లుగా బద్వేలు డిపో నుండి విజయవాడ సర్వీసు లేని కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు బస్సులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుండేదని అన్నారు. ఆయా ప్రాంతాల ప్రజల విన్నపం మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చొరవతో నూతన సర్వీసు ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. మొదటి సర్వీసు ప్రతిరోజూ రాత్రి 8 గంటలకు బద్వేలు నుంచి పోరుమామిళ్ళ, కలసపాడు, గిద్దలూరు, మార్కాపురం మీదుగా విజయవాడకు చేరుకుని తిరుగు ప్రయాణం ఉదయం 7-45 గంటలకు ఒంగోలు, పామూరు మీదుగా బద్వేలుకు సాయంత్రం 3-45 గంటలకు చేరుతుందని తెలిపారు. అలాగే రెండవ సర్వీసు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు బద్వేలు నుండి బయలుదేరి పామూరు, ఒంగోలు మీదుగా విజయవాడకు సాయంత్రం 5-15 గంటలకు చేరుకుని తిరుగు



విజయవాడ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ప్రయాణం రాత్రి 8-30 గంటలకు మార్కాపురం, గిద్దలూరు, పోరుమామిళ్ళ మీదుగా ఉదయం 5 గంటలకు బద్వేలుకు చేరుకుంటుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, కలసపాడు జెడ్పీటీసీ గురివిరెడ్డి, ఎంపీపీ నారాయణ, సీనియర్ నాయకులు పురుషోత్తంరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు సత్యం, చెన్నకృష్ణారెడ్డి, ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

బద్వేలు అర్బన్ : పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అబ్బరాతి వీధి సచివాలయం పరిధిలో ఇంటి స్థలాలు మంజూరైన 22 మంది లబ్ధిదారులకు శనివారం సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంటి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సొంత ఇల్లు లేని పేదలు ఏ ఒక్కరు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ళ స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ళు కూడా మంజూరు చేసి చరిత్ర సృష్టించారన్నారు. ఎంతో మంది పేదలను సొంతింటి యజమానులుగా చేసి వారి కళ్ళల్లో ముఖ్యమంత్రి ఆనందాన్ని నింపారని అన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు మహిళలకు విలువైన ఆస్తిని అందజేసిన ముఖ్యమంత్రి మరో అడుగు ముందుకేసి ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి, సివిల్‌సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు యద్దారెడ్డి, శివయ్య, వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, కౌన్సిలర్ రత్నమ్మ, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, రమేష్‌బాబు, రాజేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

అట్లూరు : ఆర్‌బీకేల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని బద్వేలు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. మండల పరిధిలోని అట్లూరు, కొండూరు రైతు భరోసా కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు ఉన్నాయని, ఎవరూ అధిక ధరలకు బయట దుకాణాల్లో కొనుగోలు చేయకుండా రైతు భరోసా కేంద్రాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం అట్లూరు రైతు భరోసా కేంద్రంలో 130 బస్తాలు యూరియా, కొండూరు రైతు భరోసా కేంద్రంలో 440 బస్తాలు, కమలకూరులో 40 బస్తాలు, మాడ



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

పూరులో 155 బస్తాలు, మాడపూరులో 155 బస్తాలు చొప్పున యూరియా నిల్వ ఉన్నట్లు చెప్పారు. ఒక్కో బస్తా రూ.266.85కు విక్రయించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య, అగ్రికల్చర్ అసిస్టెంటు అరుణ, హార్టికల్చర్ అసిస్టెంటు రమమోహన్‌రెడ్డి ఉన్నారు.

రైతు, కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపట్టే గ్రామీణ రైతు, కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రామయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక, రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఇందుకు నిరసనగా 13 జాతీయ కార్మిక సంఘాలు, 540 రైతు సంఘాలు సంయుక్తంగా ఈనెల 16న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఇందులో భాగంగా ఈనెల 14న స్టేట్ బ్యాంకు నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు

16న మున్సిపల్ కార్యాలయం నుండి గాంధీ రోడ్డు మీదుగా శివాలయం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో యూనియన్ల నాయకులు హరి, యేసోబ్, మధు, లక్ష్మినారాయణ, మద్దిలేటి, సాల్మన్, చంటి, గుర్రమ్మ, సుబ్బలక్ష్మి, గీత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

ప్రొద్దుటూరు : మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. శనివారం ప్రొద్దుటూరులో ఆయన మాట్లాడుతూ ఎల్‌కే అద్వానీ, పీవీ నరసింహారావు, చరణ్‌సింగ్, ఎంఎస్ స్వామినాథన్‌లను భారత రత్న పురస్కారానికి ఎంపిక చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అగ్రకుల తత్వాన్ని చాటుకుందని విమర్శించారు. దేశ రాజకీయాల్లో మూడు దశాబ్దాలపాటు అత్యంత కీలక పదవులు చేపట్టి కొత్త సంస్కరణలు చేపట్టిన, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దళితుడైనందునే కేంద్ర ప్రభుత్వానికి గుర్తుకు రాలేదని అన్నారు. ఈ సమావేశంలో డప్పు, చర్మకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాదిగ, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే బాల లక్ష్మయ్య మాదిగ, మనోహర్ మాదిగ, బాలయ్య మాదిగ, బాలఓబయ్య మాదిగ, మల్లయ్య మాదిగ, శ్రీరాములు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే పల్లెకు పోదాం

చాపాడు : ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పోరాటం చేసేందుకే ప్రజల వద్దకు వెళుతున్నామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుబ్బరాయుడు, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నగురువలూరు, పెద్దగురువలూరు, అల్లాడుపల్లె, బద్రిపల్లె, కేతవరం గ్రామాల్లో శనివారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని కరపత్రాలను పంపిణీ చేశారు.

ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ పరీక్ష ప్రారంభం



కేడెట్స్ డ్రిల్ టెస్ట్ పరిశీలిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని ముగ్గురాళ్ల కృష్ణప్ప మెమోరియల్ గాంధీనగర్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ కోర్సు డ్రిల్ పరీక్షలు నిర్వహించారు. కడప 30 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రిల్ టెస్ట్‌ను బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా విచ్చేసి పరిశీలించారు. ఎన్‌సీసీ కేడెట్స్ చేసిన డ్రిల్లు, మ్యాప్‌రీడింగ్, వెపన్‌ట్రెనింగ్ అంశాలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ హైస్కూల్ మెయిన్, గాంధీనగర్, హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, బాలవికాస్ హైస్కూల్, రాయచోటి రాజు విద్యాసంస్థలు, బద్వేలు ఫాతిమా హైస్కూల్ తదితర పాఠశాలల ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్ టెస్ట్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు పి.వి. సుబ్బారెడ్డి, ఇమాంఖాసీం, జయచంద్ర పాల్గొన్నారు.

డీఈఓకు ఘన సన్మానం



డీఈఓ అనురాధను సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మర్రెడ్డి అనురాధను శనివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు పదోన్నతుల రిజర్వేషన్లను పారదర్శంగా అమలు పరచాలని కోరారు. అనంతరం డీఈఓ మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ జిల్లాలో త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత శాతాన్ని సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు, కార్యదర్శులు మంజుల, సురేంద్ర పాల్గొన్నారు.

నేడు వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

వేంపల్లె : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో వాసవీమాతకు 102 కలశాలతో పాలాభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, తదితర విశేష పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం చండీ హోమం, గుండ ప్రవేశం ఉంటుందని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు.

రేపటి నుంచి వీరభద్రస్వామికి విశేష పూజలు

పులివెందుల టౌన్ : ఈనెల 12వ తేదీనుంచి రెండు రోజులపాటు స్థానిక తూర్పు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈనెల 12వ తేదీన ఉదయం గణపతి పూజ, పంచామృతాభిషేకం, మహా రుద్రాభిషేకం, విశేష అలంకరణ నిర్వహించి అనంతరం శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం గ్రామోత్సవం, 13వ తేదీన మహా కుంభ నివేదన (మహా నైవేద్యం), అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.